# సంబంధాలు

మధ్యాన్నం ఎండ మండిపోతోంది.

చుట్టూర చూస్తు వుంటె నీటి అలలాగ ఎండల ఆగడు.

రోడ్డు మీద వాహనాల రాకపోకలు తగ్గినయి. రోడ్డుకు ఇరుప్రక్కల మోదుగు చెట్లపొదలు. డెబ్బదేండ్ల వృద్దురాలు, పొట్లకాయల్లాంటి కాళ్లు - రెక్కలు, వాటికి అంటుకొని వున్న ముడతలు పడ్డ చర్మం. నెత్తిన మోదుగు ఆకులు మూట. చేతిలో కర్రతో రోడ్డు దాటాలని నిలుచోని వస్తున్న వ్యాన్ వైపు చూస్తువుంది.

ఆమెను చూడగానే" వ్యాన్ ఆపు" అన్నాడు టీచర్.

ఎదురుగ రోడ్డు ప్రక్కన్నే వున్న ఓ చెట్టు క్రింద వ్యాన్ ఆగింది.

టీచర్ దిగి " రా, ఈ చెట్టు కిందికిరా" అని ఆ ముసలమ్మకు సైగచేశాడు.

ముసలమ్మ చెట్టుకిందికి వచ్చింది.

ఈ లోపు అందరు దిగారు.

క్లీనర్ బానెట్ లేపి రేడియెటర్‌లో నీళ్ల పోసుకున్నాడు.

ముసలమ్మ చెట్టుకిందికి చేరింది.

" ఏ వూరు" అన్నాడు టీచర్.

రోడ్డు అవతల బోడు ప్రక్కన వున్న గూడాన్ని చూపించింది.

" ఈ ఆకులెందుకు" అంటు తలమీది ఆకులను చూస్తు అడిగాడు టీచర్.

పిల్లలంతా చుట్టూ మూగి ముసలమ్మతో టీచర్ సంబాషణ వింటున్నారు.

"ఆకులా, యిస్తర్లు కుడితందుకు".

"విస్తళ్లు ఎందుకు"

ఆమె చిన్నగా నవ్వింది. నవ్వినపుడు ముఖంలోని ముడతలన్నీ వల కదిలినట్టు కదిలాయి. నోట్లో పళ్లు యింకా వున్నాయి.

" ఆ మూట కాస్త దింపుకో పోదువుగాని" అన్నాడు. పిల్లలు ఆమె తలమీది మూటను కిందికి దించారు.

" నీ కెన్నేండ్లున్నయి"

" తెలవదు" అన్నట్టు చేయి కదిలించింది. పాపం వీళ్ల నాన్న ఈమె డేటాప్ బర్త్ రాసి వుంచనట్టుంది, అనుకున్నారు పిల్లలు.

"ఇంత వయస్సులో, యింత ఎండలో ఈ ఆకులు తెంపడం ఎందుకు" అడిగాడు టీచర్. పొట్టకోసం అన్నట్టు ఎడమచేత్తో కడుపును తాకి చూపించింది. డొక్క వెన్నుకు అంటుకపోయివుంది.

" కొడుకులు - బిడ్డలు లేరా " డ్రైవర్ అడిగాడు.

"ఉన్నరు" అని బరువైన శ్వాసవొదిలింది.

"నీకు తిండి పెట్టరా"

పెట్టరు అన్నట్టు అరచేతిని అటు ఇటు తిప్పింది. కుడిచేతిలోని కర్రతో చుట్టు చూపిస్తు.

"ఈ మోదుగు చెట్లు నా కొడుకులు బిడ్డలు. వీటి ఆకులను తీసు కపోయి యిస్తల్లు కుట్టి అమ్ముకొని పూటెల్లదీస్త ". అంది అప్పుడు ఆమె కళ్లు తడి అయ్యాయి.

"కొడుకు వున్నంక యింత కష్టం ఎందుకు పడాలి"

" కొడుకు నా కొడుకైతె కోడలు ? కొడుకు పెట్టమన్న కోడలు పెట్టొద్దు."

" నీకొడుకు చెప్పడా"

"కోడలు చెప్పినట్టె కొడుకింటడు" అన్నపుడు ఏదోనిరాశ అమె బరువైన శ్వాస ద్వారా బయటి కొచ్చింది. అపుడామె కర్రను ఎడమ చేతిలోకి మార్చుకొని, భూమికి ఆనించి కుడి చేతిలో ఎడమ చేతికి వున్న రాతెండి గొట్లను కదిలించుకుంటు గతంలోకి ఎల్లి పోయినట్టుంది.

గుండెలో నుండి దుఃఖం తన్నుకొచ్చి ముఖంలో విషాదం చోటు చేసుకుంది.

" నా దీపం వున్నంగానే నా బ్రతుకులో ఎలుగు వుండె, ఆయన సచ్చిపోయి నన్ను అడవి పాలు సేసిండు." అన్నప్పుడు ఆమె గొంతు బొంగురుపోయింది.

చుట్టూ చేరి ఆసక్తిగ వింటున్న విద్యార్థులు అర్థతతో కదిలి పోయారు. వాళ్ల వాళ్ల ఇండ్లల్లలో అమ్మమ్మలు, నాయనమ్మలు గుర్తొచ్చారు. వాళ్ల పట్ల వాళ్ల వాళ్ల తల్లి - తండ్రులు చూపె ఆదరణ - నిరాదరణ గుర్తురాసాగింది.

" ఈ రోజు అన్నం తిన్నావా" అని అడిగాడు టీచర్.

" యింటికి పోయి తింట" అంది.

" మన దగ్గర బిస్కెట్స్ వున్నాయిగ, తెచ్చియివ్వండి" అన్నాడు టీచర్.

ఓ విద్యార్థి వెళ్లి బిస్కెట్స్ పాకేట్‌ను తెచ్చి యిచ్చాడు. అందరికి చేతులు జోడించి దానిని తీసుకుంటు వొళ్లో దాచుకుంది.

" తినడానికి యిచ్చాము. దాచుకుంటావ్" అన్నాడు విద్యార్థి.

" ఇంటికి పోయి తింట"

"ఇప్పుడె తిను" అన్నాడు విద్యార్థి.

"ఇంటి దగ్గరి నా మనమడున్నాడు".

" కొడుకు కొడుకా"

" అవును కాల్లుమొక్కుత". బిస్కెట్ ప్యాకెట్‌ను సరిగ రొండికి చేక్కుంటు అంది.

"నీ కొడుకు నీకు తిండి పెట్టడం లేదు గదా ఆయన కొడుకు గురించి నీ కెందుకు " అన్నాడు విద్యార్థి.

" సంటోడు, అన్నెం - పున్నెం ఎరగనోడు" అంది బ్రతిమాలినట్లు.

"తల్లి మనస్సు అంతె పదండి పోదాం" అంటు వ్యాన్ వైపు నడిచాడు టీచర్.

పిల్లలు ఆమె మూటను నెత్తిన పెట్టి అక్కడి నుండి కదిలారు.

" మా అయ్యలారా సల్లగ బతకండ్రి" అంటు వాళ్లు వెళ్లిన వైపు చేతులెత్తి మొక్కింది.

వ్యాన్ కదిలింది.

" సర్, ముసలమ్మ ఎర్రటి ఎండలో మోదుగు ఆకులు తెంపడానికి ఎందుకు అడవికొచ్చిందో"

" పొట్టకోసం" అన్నాడు టీచర్.

"తల్లికి అన్నం బెట్టని కొడుకులుంటారా సార్ అన్నాడు శర్మ.

"మీరే తెలుసుకొండి, మీ మీ ఇండ్లల్లో, మీ వాడల్లో చూస్తూవుంటే మీకే కనిపిస్తు వుంటారు." అన్నాడు టీచర్ ఒకరిద్దరు తమ తల్లులను గుర్తుచేసుకుని గుటకలు మింగారు. మరి కొందరికి తమ తమ ఇండ్లలో తండ్రుల ప్రవర్తన గుర్తొచ్చి బరువుగ శ్వాసవొదిలారు.

" పిల్లలూ మానవ సంబంధాలలో ఈలాంటి అమానవీయత చోటు చేసుకోవడం, పల్లెలో కుటుంబ జీవితాలు అస్తవ్యస్తం కావటం ఆత్మ హత్యల వరకు దారి తీస్తున్నాయి". అన్నాడు టీచర్.

పిల్లల శ్రద్ధగ వింటున్నారు.

"అందుకే పెద్దలు ఓ కథ చెపుతారు కదా సార్" డ్రైవర్.

"'ఏం కథ" టీచర్.

" రామయ్య అనే వ్యక్తి తాను తన భార్య పిల్లలు కంచాలలో తింటూ తండ్రికి ఓ చిప్పలో పెట్టేవాడట, ఆ వృద్ధుడు ఆ చిప్పలో రోజు తింటూ కడిగి అతి జాగ్రత్తగ దడిలో దాచుకునేవాడట. అనుకోకుండా ఓ రోజు చేయిజారి చిప్ప పగిలిందట. అది చూసిన రామయ్య కొడుకు, అయ్యో తాతయ్య చిప్పను పగులగొట్టావా? నాన్నకోసం మరో కొత్త చిప్పకొనాలా? నాన్నా నీవు ముసలవాడవైనాక దేంట్లో తింటావు అంటాడట తండ్రితో. అంతే - తండ్రి నివ్వేరపోయి నిలుచుంటాడట" అని ముగిస్తాడు డ్రైవర్.

"అది మానవ సంబంధాల గురించి గొప్ప గుణపాఠం చెప్పే కథ. మమతలు మరిచే వ్యక్తికి కనువిప్పు కలిగించె కథ. ఈ కథ రాసిన రచయితకు మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలిగ" అన్నాడు టీచర్.